క్లుప్తంగా

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పెద్దాపురం: పట్టణంలోని పాసిలి వీధి గణేశ్ మంటపంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకురాలు తుమ్మల పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో జిల్లా కన్వీనర్ మాలకొండయ్య పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత నిమజ్జనానికి అనుమతి

కాకినాడ సిటీ: ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత సిటీ వినాయక సాగర్‌లో మూడు అడుగుల గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అనుమతి ఇచ్చిందని నగర గణేశ్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు శుక్రవారం స్థానిక జగన్నాథపురంలో విలేకర్లకు తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాలతో ఆర్డీఓ ఇట్ల కిశోర్ నిమజ్జన ఏర్పాట్లను పూర్తి చేశారన్నారు. ఈ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు ప్రత్యేక పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నిర్వహణను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. 35 ఏళ్ల వినాయక సాగర్‌లో అనుమతి లేని పార్కు నిర్మాణం, కరోనా విపత్తు వలన ఐదేళ్ల కాలం వృథా అయ్యిందన్నారు. వాహనాల ప్రవేశం లేకుండా విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అనుమతించడం వల్ల, వంతెనపై నుంచి ప్రతిమలు, పూజా పత్రి విసరకుండా, వినాయక సాగర్‌లో నేరుగా కలిపే అవకాశం లభించిందన్నారు. శుక్రవారం సాయంత్రం నిమజ్జన ప్రాంతాన్ని గణేశ్ ఉత్సవ కమిటీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, తదితరులు పరిశీలించారు.

ఐఐఎఫ్‌టీ విద్యార్థుల ఓరియంటేషన్ ముగింపు



ఓరియంటేషన్ ముగింపులో విద్యార్థులతో అతిథులు

బాలాజీచెరువు: వారం రోజుల పాటు జేఎన్‌టీయూకే సెనెట్ హాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫారిన్ ట్రేడ్ కోర్సుకు సంబంధించి అడ్మిషన్ పొందిన 2024–29 బ్యాచ్ విద్యార్థులకు జరిగిన ఓరియంటేషన్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఐఐఎఫ్‌టీ హెడ్ వడ్లమూడి రవీంద్ర సారధి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, ఐఐఎఫ్‌టీ వీసీ రాకేష్ మోహన్‌జోషి, ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్, ఆరోరా లైఫ్ సైన్సెస్ సీఈఓ రాజేంద్రరావు హాజరయ్యారు. ఫస్టియర్ విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ప్రాధాన్యాన్ని వివరించారు. ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ భాష అభ్యాసనం ప్రాముఖ్యాన్ని వివరించి, విద్యార్థులు ధైర్యంగా ప్రతి సవాళ్లను ఎదుర్కోవాలన్నారు. ఈడీ రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ ఐఐఎఫ్‌టీ అనేది ఆధునిక గురుకులం లాంటిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్‌టీ ఓఎస్‌డీ బాబురావు నాయుడు పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి

బాలాజీచెరువు: విద్యార్థులంతా హిందీ భాషపై పట్టు సాధించాలని పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిరుపాణ్యం మాట్లాడుతూ, దేశంలోని అన్ని ప్రాంతాల్లో హిందీ భాష వాడుకలో ఉందన్నారు. అధ్యాపకులు హిందీ సెమినార్లలో పాల్గొని, విద్యార్థులను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్ మాట్లాడుతూ, జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష దోహదపడిందన్నారు. అందుకు గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగంలో 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయ భాషగా పొందుపరిచారన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేవీ సత్యనారాయణ, వేదుల శిరీష, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఉష, బేగం పాల్గొన్నారు.

వెన్ను తట్టి.. ధైర్యం చెప్పి..

- బాధితులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా
- వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృత పర్యటన



పిఠాపురం: మీకు అండగా నేనున్నాను.. మీ సమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వంతో పోరాడుతానంటూ.. వరద బాధితులకు భరోసా కల్పించారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పిఠాపురం నియోజకవర్గంలోని ఏలేరు వరద ప్రభావానికి గురైన కొత్తపల్లి మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పిఠాపురం మండలం మాధవపురం, కొత్తపల్లి మండలం ఇసుకపల్లి, నాగులాపల్లి రమణక్కపేట గ్రామాల్లో వరద ప్రాంతాలను పరిశీలించారు. పలువురు బాధితులను కలుసుకున్న ఆయన వారి బాధలను విని, వారికి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ పిఠాపురం ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత, పలువురు పార్టీ నాయకులు వెంట రాగా, ఆయన వరద ప్రభావిత



వరద ప్రభావిత ప్రాంతంలో తమ గోడును మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకుంటున్న ప్రజలు

గ్రామాల్లో నీట మునిగిన వరి పంటలను, ఇళ్లను పరిశీలించారు. ఇంత పెద్దఎత్తున వరద ఎప్పుడూ రాలేదని, ఇళ్లు దెబ్బతిన్నాయని, పంటలు పూర్తిగా నాశనమయ్యాయని స్థానికులు ఆయనకు వివరించారు. పలువురు మహిళలు ఆయన వద్ద తమ సమస్యలు ఏకరవు పెట్టగా, ఆప్యాయంగా పలకరించిన ఆయన.. మీ సమస్యలు తీర్చే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని, అన్ని విధాలా ఆదుకునేలా చూస్తానని భరోసా కల్పించడంతో. బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, గండేపల్లి బాబీ, మొగలి బాబ్జి, మొగలి అయ్యారావు, జ్యోతుల బాబులు, వడిశెట్టి నారాయణరెడ్డి, బత్తుల సాయిరాం, రావు చిన్నారావు, జ్యోతుల చక్రబ్బాయి, వులవల భూషణం, రావుల మాధవరావు తదితరులు ఉన్నారు.

చిన్నారెడ్డికి జగన్ పరామర్శ

కొత్తపల్లి: కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణక్కపేట సర్పంచ్ కాజులూరి అమ్మాజీ భర్త, వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు కాజులూరి చిన్నారెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఏలేరు వరద ముంపుతో నష్టపోయిన రైతులను, బాధితులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఇక్కడకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే చిన్నారెడ్డిని ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.



రమణక్కపేటలో చిన్నారెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సుస్థిర లక్ష్యాలను అమలు చేయాలి

ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్



అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణమోహన్

సామర్లకోట: జిల్లా స్థాయి అధికారులు సుస్థిర లక్ష్యాల అమలుకు కృషి చేయాలని విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ) వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ) సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణలో భాగంగా మూడు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులకు 'ఆరోగ్యకరమైన గ్రామం' అనే అంశంపై శిక్షణ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులందరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫ్యాకల్టీలు డీఆర్ఎస్ పద్మజ, ఎం.చక్రపాణిరావు వి.ప్రసాద్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

ముంపు పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

సామర్లకోట: మండలంలోని పవర గ్రామంలో నీట మునిగిన పంటలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం పరిశీలించారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు, ఏలేరు కాలువ జలాల కారణంగా పవర, చంద్రంపాలెం, అచ్చంపేట, వీకే రాయపురం గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నీట మునిగాయి. పవర గ్రామం సమీపంలో 216 జాతీయ రహదారి నిర్మాణంతో తరుచూ పంట భూములు ముంపునకు గురవుతున్నాయని ఎమ్మెల్యే వద్ద రైతులు వాపోయారు. గ్రామంలో సుమారు 300 ఎకరాలు ముంపునకు గురైనట్టు తెలిపారు. పొలాల కంటే రోడ్డు ఎత్తుగా నిర్మించడంతో, నీరు పాయే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ఆకునూని సత్తిబాబు, మాజీ సర్పంచ్ ముచ్చెర్ల కల్యాణ్, పలువురు రైతులు ఉన్నారు.

రైతాంగాన్ని ఆదుకుంటాం

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల్లో శుక్రవారం వరద ముంపునకు గురైన పొలాలను ఎమ్మెల్యే చినరాజప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,



పవర గ్రామంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

వరద ముంపు వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు, ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం త్వరలోనే రైతులకందేలా చర్యలు చేపడతామన్నారు. వ్యవసాయాధికారి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, రైతులు పంట నష్ట పరిహారం గుర్తింపునకు ఆర్బీకేల వద్ద ఈ నెల 14లోగా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఉద్యాన అధికారి సుజాత, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న నవరాత్రులు



వినాయకునికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో గణపతి నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కుడుకుడుమిల్లి పోస్టాఫీస్ వీధిలో ఉన్న గణపతి మందిరం వద్ద రామ్‌గణేశ్ యూత్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. గణపతి నవరాత్రులు ఆదివారంతో ముగియనుండడంతో, ఈ నెల 15న సాగర తీరంలో నిమజ్జన కార్యక్రమాలు మొదలు కానున్నాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో నిమజ్జన వాహనాలకు మినహా మిగిలిన వాటికి అనుమతి లేదు.

మహిళను కాపాడిన రైల్వే పోలీసులు



మహిళను బంధువులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

సామర్లకోట: బలవన్మరణానికి యత్నించిన మహిళను శుక్రవారం సాయంత్రం సామర్లకోట రైల్వే పోలీసులు కాపాడిన సంఘటన ఇది. రైల్వే స్టేషన్ ఆవరణలో సీసీ కెమెరాలు లేకపోవడంతో, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు తన సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒకటో నంబరు ప్లాట్‌ఫారంలోని ఫ్లై ఓవర్ వంతెన వద్ద ఓ వివాహిత ఏడుస్తూ గస్తీ పోలీసులకు కంటపడింది. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వందేభారత్ రైలు రావడం, ఆ రైలు కింద దూకేందుకు మహిళ పరుగెత్తుకుంటూ వెళ్లడాన్ని పోలీసులు గమనించారు. అప్రమత్తమైన రైల్వే కానిస్టేబుల్ వైవీఎస్ నారాయణ ఆమెను అడ్డుకుని, జీఆర్పీ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సై లోవరాజు శుక్రవారం సాయంత్రం ఆమె బంధువులకు సమాచారం అందించారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి, బంధువులకు అప్పగించారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆమె ఈ ఘటనకు పాల్పడినట్టు తెలిసింది. ఆమె బంధువులు రైల్వే పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మరుభూమికి మార్గం లేక..



మృతదేహాన్ని బోటుపై తీసుకు వెళుతున్న వీఆర్వో పరమేశ్వరరాజు

పిఠాపురం: గొల్లప్రోలు జగనన్న కాలనీకి చెందిన మునరపు సుబ్బారావు (80) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఏలేరు వరద ప్రభావంతో మరుభూమికి మృతదేహాన్ని తీసుకెళ్లే దారి లేకపోవడంతో ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ కేవీవీ సత్యనారాయణ వీఆర్వో పరమేశ్వరరాజును అప్రమత్తం చేశారు. వెంటనే ఒక బోటు ఏర్పాటు చేసి మృతదేహాన్ని బోటుపై తరలించి అంత్యక్రియలు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

ఏచూరి సంస్మరణ సభలో సీపీఎం నేత శేషుబాబ్జి



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పార్టీ జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జి అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం పార్టీ నాయకుడు నీలపాల సూరిబాబు అధ్యక్షతన ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా శేషుబాబ్జి మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావాలతో, ప్రజా ఉద్యమాల వైపు ఏచూరి అడుగుపెట్టారన్నారు. అత్యంత చిన్న వయస్సులో కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారని, తర్వాత పొలిట్‌బ్యూరోకు..జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కామన్ మినిమమ్ ప్రోగ్రాం ద్వారా ప్రజలకు అవసరమైన ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం తీసుకురావడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. లౌకికవాదులను ఐక్యం చేయడంలో, దేశంలో రాజ్యాంగాన్ని కాపాడడంలో ఎనలేని కృషి చేశారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, కరణం ప్రసాదరావు, డి.సత్యనారాయణ, బాలం శ్రీనివాస్, కరణం గోవిందు, డి.కృష్ణ, గడిగట్ల సత్తిబాబు, సీఐటీయూ నాయకులు డి.బేబీ, నాగమణి, పద్మ, వరలక్ష్మి, సావిత్రి, మరిడయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగులాపల్లి-రమణక్కపేట రోడ్డులో ప్రజల అవస్థలు

ముంపులోనే పొలాలు

పొంగిపొర్లుతున్న నాగులాపల్లి పాటి కాలువ

కొత్తపల్లి: ఏలేరు అదనపు జలాల విడుదలతో జలమయమైన పొలాల్లో ముంపునీరు శుక్రవారం తగ్గుముఖం పట్టింది. నాగులాపల్లి-రమణక్కపేట రహదారుల్లో ముంపు నీరు ఇంకా ప్రవహిస్తోంది. నాగులాపల్లి శివారు పాటి కాలువ పొంగిపొర్లుతోంది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇసుకపల్లి, నాగులాపల్లి, కొత్త ఇసుకపల్లి, రమణక్కపేట తదితర గ్రామాల్లోని పొలాలు ముంపులోనే కొనసాగుతున్నాయి.



రమణక్కపేటలో చెరువుగా మారిన పంటలు



మాధవపురంలో చెరువును తలపిస్తున్న పొలాలు



ముంపులో ఉన్న మాధవపురం రోడ్డులోని ఇటుకల బట్టీ

జై జై గణేశా..

- గణపతి నిమజ్జనాలకు సర్వం సిద్ధం
- పోలీసు, మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు
- ఆదివారం నుంచి నిమజ్జనాల జోరు

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిమజ్జనాల ప్రక్రియ మొదలైంది. వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తెచ్చి గోదావరి కాలువ, ఏలేరు కాలువ, సముద్రాల్లో నిమజ్జనం చేస్తారు. సామర్లకోట, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను సామర్లకోట గోదావరి కాలువలో నిమజ్జనాన్ని నిర్వహిస్తారు. పెద్దాపురం నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాల్లో 192 శిబిరాలు ఏర్పాటయ్యాయి. ఆయా శిబిరాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ఐదు, ఏడు, తొమ్మిది రోజుల పాటు పూజలు చేశాక, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇప్పటికే చిన్న శిబిరాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ ప్రతిమల నిమజ్జనాలు ప్రారంభించారు. మంగళ, శుక్రవారాలు మినహా మిగిలిన రోజుల్లో నిమజ్జనాలు ఉంటాయి.

అధికారుల పర్యవేక్షణలో..

ఆయా ప్రాంతాల్లో గణేశ్ ఉత్సవాలను ముగించి, నిమజ్జనాలను చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. తొమ్మిది రోజులు పూర్తయ్యాక ప్రతి రోజూ నిమజ్జనాలుంటాయి. దాంతో ఆదివారం నిమజ్జనాలు ఎక్కువగా ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సామర్లకోట పట్టణంతో పాటు, పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన గణేశ్ శిబిరాల్లో గణపతి విగ్రహాలను సామర్లకోట గోదావరి కాలువలో నిమజ్జనం జరుగుతుంది. మండలంలో పీబీ దేవం, జి.మేడపాడు, జి.కొత్తూరు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల్లో కెనాల్ రోడ్డులోని గోదావరి కాలువలో విగ్రహాలు నిమజ్జనం చేస్తారు. ఏటా పంచారామ క్షేత్రం ముఖద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవులో విగ్రహాలను నిమజ్జనం చేయడానికి పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి.



సామర్లకోటలోని ఆటో యూనియన్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం



విగ్రహాలను నిమజ్జనం చేసే గోదావరి కాలువ రేవు



సామర్లకోట గోదావరి కాలువ రేవులో బారికేడ్లు కట్టిస్తున్న పోలీసు సిబ్బంది

నిబంధనలు పాటించాలి



గణేశ్ నిమజ్జనాల్లో నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. నిబంధనలను విస్మరిస్తే చర్యలు తప్పవు. పోలీసు, రెవెన్యూ, మున్సిపాలిటీ శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలి. నిమజ్జనాలకు చిన్న పిల్లలు, మహిళలు దూరంగా ఉండాలి. మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొంటే చర్యలుంటాయి. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేయాలి. నిమజ్జన ప్రాంతంలో గజ ఈతగాళ్లను నియమించాం. క్రేన్ ఏర్పాటు చేశాం. స్నానాలను గోదావరి రేవులో మాత్రమే చేయాలి. ఆయా ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం.

– ఎ. కృష్ణభగవాన్, సీఐ, సామర్లకోట

20 ఏళ్లుగా ఉత్సవాలు



గత 20 ఏళ్లుగా స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద శ్రీలక్ష్మీ గణపతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు చేస్తున్నాం. పోలీసు వారి నిబంధనలను తప్పక పాటిస్తాం. ఆటో యూనియన్ సభ్యులు కట్టిన సభ్యత్వాలు, భక్తుల విరాళాలతో గణపతి విగ్రహం ఏర్పాటు చేసి, తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి, ఊరేగింపుగా నిమజ్జనానికి తరలిస్తాం. శనివారం అన్నదానం ఏర్పాటు చేసి, సోమవారం గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తాం.

– డి.సోమేశ్వరరావు, ఆటో యూనియన్ అధ్యక్షుడు, సామర్లకోట

పంట నష్టం నమోదు సక్రమంగా చేయండి

అధికారులను నిలదీసిన జెడ్పీటీసీ

పిఠాపురం: పంట నష్టం నమోదు సక్రమంగా చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, సక్రమంగా నమోదు చేసి, వాటి వివరాలు ప్రజాప్రతినిధులకు అందజేయాలని జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు అధికారులను నిలదీశారు. శుక్రవారం గొల్లప్రోలు ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సమావేశం ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో భాగంగా వ్యవసాయాధికారి సత్యనారాయణ మాట్లాడుతుండగా, జెడ్పీటీసీ ఉలవకాయల లోవరాజు కల్పించుకుని.. గత పంట నష్టాలు సక్రమంగా నమోదు చేయక రైతులు నష్టపోయారని చెప్పారు. ఇప్పుడు కూడా పంట నష్టం నమోదు సమాచారాన్ని స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మల్లవరం రోడ్డు మరమ్మతులపై ఆర్అండ్‌బీ ఏఈని ప్రశ్నించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. వైస్ ఎంపీపీలు నేమాని ఆదివిష్ణు, బత్తిన మంగా, ఎంపీడీఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు